పాత సంప్రదాయం

1

బతికి ఉండగా శేషగిరిరావు కలెక్టరీ చేశాడనీ, మధుసూదనరావు బి.ఏ. పరీక్షలో మొదటి క్లాసులో మొదట వచ్చేడనీ కాదు మధుసూదనరావుకు సోమసుందరంగారు పిల్లనిచ్చింది.

శేషగిరిరావు గారూ, సోమసుందరంగారూ చిన్నతనం నుంచీ ప్రాణ స్నేహితులుగా ఉండేవారు. ఇద్దరికీ వివాహాలయినా సంసారాలు నెత్తినిపడ్డా, ఉద్యోగాల్లో ప్రవేశించినా, ఎడబాటు కలిగినా వారిమధ్య ఉన్న బంధం తెగలేదు. ఎవరో వారిద్దరి స్నేహితం చూచి అన్నట్టు ఒకరు భార్యా ఒకరు భర్తా అయి పుట్టినట్టయితే అంత అన్యోన్యం కల దంపతులు వేలుమడిచి చూపటానికి ఉండేవారు కారు. వారు ఒకరికొకరు వ్రాసుకునే ఉత్తరాలు చదివి తీరాలి.

శేషగిరిరావు చనిపోయే సమయానికి ఆయన రిటైరయినాడు. సోమసుందరం గారు పట్టణంలో ఒక న్యాయమూర్తిగా ఉంటున్నాడు. శేషగిరిరావు మరణవార్త విని సోమసుందరం గారు దుఃఖించక "ఇక మాకు ఒకరికొకరం కలిసి ఉండడానికి ఏమీ అభ్యంతరం లేదు. కాని వాడి చేతిమీదుగా కావలసిన కార్యాలు ఒకటి రెండు అట్టే ఉండిపోయినాయి. వాడికొక్కడే కుమారుడు. నాకొక్కతే కుమార్తె. దేవుడు మమ్మల్ని వియ్యం పొందమని ఏర్పాటు చేశాడు. ఇప్పుడైనా మించిపోయింది లేదు. ఈ క్షణం నించీ మధుసూదనరావుకు నేనే తండ్రిగా ఉండి, ఇప్పుడు శేషగిరి తన కొడుక్కు చేసుకోలేని సహాయం చేస్తాను" అనుకున్నాడు.

శేషగిరిరావు గారికి పిత్రార్జితం ఒక సెంటు భూమి కూడా లేదు. ఆయన స్థితిలో ఉన్న మానవుడెవడైనా బాగా గడించి ఉండును. కాని ఆయన సంపాదనకు కనబడుతూన్నది ఎనిమిదెకరాలు మాత్రమే. ఆయన చనిపోయే సమయానికి మధుసూదనరావు బి.ఎ. పరీక్షలో చేరటానికి సిద్ధంగా ఉన్నాడు.

ఈ సమయంలో మధుసూదనరావుకు సోమసుందరం దగ్గిర నుండి ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరం చూచి మధుసూదనరావు ఆశ్చర్యపడ్డాడు.

"నీ తండ్రి నాకు ప్రాణ సమానుడు. నీ భవిష్యత్తును గురించి నీ తండ్రి ఏమేమి ప్రయత్నాలు చేసేవాడో అవన్నీ నేనుకూడా చెయ్యటానికి నీకేమీ అభ్యంతరం ఉండదనుకుంటాను. నీ తండ్రియందు నీకెంత నమ్మకం ఉన్నదో నాయందుకూడా అంత నమ్మకం ఉంటే నాకు చాలా సంతోషంగా ఉంటుంది."

సోమసుందరంగారిని మధుసూదనరావు ఒకటి రెండుసార్లు చూచేడు కాని ఆయన అతని మానసిక ప్రపంచంలోకి ఇంకా రాలేదు. ఈ ఉత్తరం చూడగానే మధుసూదనరావుకు ఆయనయందు ఒక విధమైన పక్షపాతం, అభిమానం కలిగింది. ఆయన చెప్పినట్టు అక్షరాలా చెయ్యాలనిపించింది. తన తండ్రే సోమసుందరంగారి రూపకంగా తనకు సలహా ఇస్తూన్నట్టుగా ఉన్నదతనికి.

ఇంతకూ ప్రస్తుతం సోమసుందరంగారు మధుసూదనరావుకు ఇవ్వదలచిన సలహా ఏమిటంటే, అతను మెద్రాసులో తన ఇంట్లో ఉంటూ బి.ఏ. చదవాలని. మధుసూదనరావు మారు చెప్పకుండా ఆయన ఆహ్వానం స్వీకరించేడు.

అతను బి.ఏ. చదివిన రెండేళ్ళూ సోమసుందరం గారింట్లో అల్లుడికి జరిగినట్టు జరిగింది. మొదటినించీ మధుసూదనరావుతో సోమసుందరం తన కుమార్తె లీలావతిని అతనికిస్తానంటూనే వచ్చేడు. చిన్న కారువారా ఇంట్లో ఎవరూ లేకపోవడం చేత లీలావతి మధుసూదనం ఒకరికొకరు తప్పనిసరిగా స్నేహితులైనారు. తనకు లీలావతినిచ్చి చేస్తానని సోమసుందరం అంటూండటం వల్లనో, లీలావతి అప్పటికే పన్నెండేళ్ళు నిండిన పిల్ల కావటం చేతనో మధుసూదనరావామెను కొత్తలో తప్పించుకు తిరిగేవాడు. కొద్ది కాలంలో ఆ బిడియం పోయిందతనికి. దానికి కారణం సగం లీలావతి తనతో స్వేచ్ఛగా మాట్లాడటం కూడా కావచ్చును. అదీకాక అతనామెకు రోజూ ఉపాధ్యాయత్వం చెయ్యవలసి వచ్చింది. అంతవరకు ఇంటిదగ్గిర చదివి ఆ కిందటి సంవత్సరం లీలావతి నాలుగో ఫారంలో ప్రవేశించింది ఆశకొద్దీ.

సోమసుందరం గారింట్లో అంతా నూతన సంప్రదాయం. మొదట్లో ఈ పద్ధతంతా మధుసూదనరావుకి కొత్తగా ఉన్నా త్వరలోనే అతడు దీనికి అలవాటు పడిపోయినాడు. రెండేళ్ళు గడిచిన తరవాత అతనికీ పద్ధతే బాగా ఉన్నట్టు తోచింది.

మధుసూదనరావు బి.ఏ. పూర్తయింది. కొలిచినట్టు లీలావతి స్కూలు చదువూ పూర్తి అయిపోయింది. మధుసూదనరావుకూ, అతని తల్లికీ, తదితర బంధువులకూ ఏ విధమైన అభ్యంతరం లేకపోతే ఆ వేసవిలో మధుసూదనరావుకు లీలావతినిచ్చి చేస్తానన్నాడు సోమసుందరం.

"పిల్ల పెద్దదని మీ బంధువులు అభ్యంతరం చెప్పవచ్చును. కాని ఒక సంగతి

మాత్రం ధైర్యంగా చెప్పగలను. ఇప్పుడు శేషగిరి బతికి ఉంటే నీకు తప్పక లీలను చేసుకుంటాడు. నీకనుమానం అక్కర్లేదు. ఏ విషయంలోనూ వాడికొక ఆలోచన అంటూ ఉండేది కాదు. నీకిష్టమయితే నాకింకొకరి అభిప్రాయంతో పనిలేదు. అదీకాక ఇప్పుడు రజస్వలానంతర వివాహాలు అనేకం జరుగుతూనే ఉన్నాయి. మనవారు ఆమోదిస్తూనే ఉన్నారు. ముందు నీ అభిప్రాయం చెప్పు."

"నాకేమీ అభ్యంతరం లేదు లెండి!" అన్నాడు మధుసూదనరావు ఆలోచనతో.

"నీకేమాత్రం అనుమానమున్నా నా నిర్బంధం లేదుసుమా. నా పద్ధతులు లోకం యావత్తూ ఆమోదిస్తుందనుకోను. ఆమోదించటం నాకు ఇష్టమూ లేదు. నా కుమార్తె విషయం నాకుగల నమ్మకాన్ని బట్టి ఇంతకాలం వివాహం చెయ్యలేదు. అందుకని అందరూ లీల మాదిరిగా ఉంటారని నేనూహించుకోను. ఇంకొకరెవరైనా కొత్త సంప్రదాయం తెచ్చి పెడితే నేనాగ్రహించుకోను. కాబట్టి నీకే మాత్రం ఇష్టం లేకపోయినా?"

మధుసూదనరావు నవ్వి తల ఊపుతూ "నాకభ్యంతరమేమిటి? నాకు చాలా ఇష్టం కూడాను. మా బంధువుల విషయమే...."

"వారనుమతించరేమో మరి!"

"ఇది నా వివాహం."

"మంచిది. పెద్దవారి నెదిరించటం తప్పే కాని, మన మంచి చెడ్డలను, సుఖ దుఃఖాలను తృణీకరించే వారిని నిరసించటమే నాకు మంచి పద్ధతిగా కనిపిస్తుంది. ఇంకొక విషయం చెబుతాను. వివాహాలమీద అంతులేని ధన వ్యయం నాకిష్టం లేదు. వివాహానికి స్వయంగా నువ్వేమీ డబ్బు ఖర్చుపెట్టనక్కర్లేదు. ఈ డబ్బంతా నీదే అవుతుంది. నీకయ్యే ఖర్చుకూడా నేనే పెట్టి నాకు తోచిన పద్ధతిగా వివాహం చేస్తాను. నీకు సమ్మతమేనా?"

"మీ ఇష్టం."

"సరే! ఒక పని చెయ్యి. వీలయినప్పుడు ఈ వివాహానికి లీల అభిప్రాయం కూడా కనుక్కో... నేనూ కనుక్కుంటాను. శతవిధాల దాని కింకొక అభిప్రాయం ఉండకూడదు."

మధుసూదనం లీలావతి అభిప్రాయం అడిగేడు. ఆమె ఏమీ చెప్పలేదు. కాని ఆనాడు వెన్నెలలో ఆమె ముఖంలో, కళ్ళలో అతనికేమి కనిపించిందో కాని ఆమెకు వివాహం ఇష్టమైనట్టు మధుసూదనరావు తృప్తిపడ్డాడు.

మర్నాడే తెలిసినవారు వచ్చి ముహూర్తం ఏర్పాటు చేశారు. ఆ రాత్రి మెయిలులో సోమసుందరం మధుసూదనరావూ ముఖ్యులైన బంధువులనూ, స్నేహితులనూ స్వయంగా ఆహ్వానించటానికి బయలుదేరారు.

లోకానికి నోరూరుకోక పోవటం సహజమే. కాబట్టి మధుసూదనరావు భవిష్యత్తును

గురించి రకరకాల ఊహలు అతని చుట్టాల్లో బయలుదేరినాయి. "మధుసూదనరావుకు సోమసుందరం కుమార్తెనిచ్చి చేస్తాడేమో?" "ఎక్కడైనా బావా అనుకాని వంగతోట దగ్గిర మాత్రం వద్దు! ఏమి చూచి ఇస్తాడండీ కుమార్తెను? చెప్పండి!" "నిజమే! అసలా పిల్లకు పెద్దదయేవరకూ వివాహం జరగదు! అప్పుడా పిల్ల ఏ ఐ.పి.ఎస్.నో చేసుకుంటుంది కాని మనవాడి ముఖం చూస్తుందా? ఏదో చదవనుకూడా చదువుతున్నదట?" "అయితే మధుసూదనరావును అక్కడికి ఎందుకు రమ్మని పిలిచేడు?" "పిలిచాట్టయ్యా! ఏదో ధోరణి! శేషయ్యకూ ఆయనకు స్నేహితం కాబోలు! లాంఛనగా రమ్మని ఉంటాడు. మనవాడు అన్నదేచాలునని వెళ్ళి కూర్చున్నాడు. శలవులకైనా ఇక్కడికి రాకుండా? వాణ్ణి అక్కడ ఒక కుక్క కింద చూస్తూండరూ?" "బి.ఎ. పరీక్షలయినాయిగా. వస్తాడేమోలే! ఈసారి తెలుస్తుంది సంగతంతా!"

అనుకున్న ప్రకారం రానే వచ్చాడు. మధుసూదనం పక్కన సోమసుందరం ఉండటం చూచి బంధువర్గం చాలా ఆశ్చర్య పడ్డది. సోమసుందరం మధుసూదనరావు చేత ముఖ్యులనందరినీ పిలిపించి, అందరి ఎదటా సంగతి యావత్తూ బయటపెట్టేడు. బంధువర్గం కొయ్యబొమ్మయి పోయింది. ఆశ్చర్యం, కోపం, అసూయ ఇన్నీ ఒక్కొక్కరిలో పొంగిపోతూ కూడా సోమసుందరం ఎదుట తల ఎత్తలేకపోయినారు. ఒక్కరూ మాట్లాడలేదు! లోపల అందరూ ఈ విపరీత పరిస్థితికి ఆశ్చర్యపడేవారే. ఒకచెంప ఈ రజస్వలానంతర వివాహ ప్రయత్నానికి మండిపడేవారే; ఒక మూల మధుసూదనం అదృష్టానికి అసూయపడేవారే.

అందరి దారీ ఒకటి హనుమాయమ్మగారి దారొకదారి. ఆమెకు రజస్వలానంతర వివాహాలు ఇష్టంలేదు. ఆమెకు కొత్త సంప్రదాయాలు తెలియవు. ఆమె భర్త కూడా తన అభిప్రాయాలకు ఆమెను బద్ధురాల్నిగా చెయ్యక ఆమె ఇష్టం వచ్చినట్టు పోనిచ్చేడు. ఆమెకు సోమసుందరాన్ని చూస్తే అమిత గౌరవం ఉన్నది. ఆమెకు కుమారుడి అదృష్టాన్ని చూసి అసూయ లేదు. కాని ఆమెకు ఈ వివాహం ఇష్టంలేదు. ఎంతమాత్రమూ లేదు! కుమారుడితో ఆ మాట అనేటందుకు అవకాశం దొరకలేదు. ఆమె మాట్లాడకుండా ఊరుకున్నది. ఆమెను సోమసుందరం తమ వెంటనే రమ్మన్నాడు. ఆమె అన్నిటికీ అంగీకరించింది.

మధుసూదనరావు సోమసుందరం అన్న మాటలనుబట్టి వివాహం తేలికగా జరిగిపోతుందనుకున్నాడు. కాని చాలా జయప్రదంగా జరిగింది. అనేకమంది పెద్దలు వచ్చి మధుసూదనరావునూ, లీలావతిని శ్లాఘించి వెళ్ళేరు. మధుసూదనరావు వైపున వచ్చినవారు అతని తల్లీ, స్నేహితులూ, ఒకరిద్దరు బంధువులు మాత్రమే! మధుసూదనరావు పరిపూర్ణంగా తృప్తి పడ్డాడు!

2

బి.ఎ. పరీక్షలో మధుసూదనరావు అద్భుతంగా ప్యేసయినాడు. అతని ఉపాధ్యాయులతన్ని ఇంకా చదవమని ప్రోత్సహించేరు. అతనికీ చదువు ఆపుదామని లేదు. కాని తల్లికూడా వచ్చి ఉంటే బాగుంటుందని అతనికి తోచింది. సోమసుందరం కూడా అమెను తీసుకొని రమ్మని సలహా ఇచ్చేడు.

మధుసూదనం స్వగ్రామం వచ్చేడు. అతనక్కడే ఉన్న పది గంటల్లో తల్లి రానని చెప్పటం, బంధువులు నోటికి వచ్చినట్టు పేలటం అంతా అయింది. "ఇన్నాళ్లు కనిపెంచిన తల్లి విషమైంది? ఇంతకాలం నించీ ఉన్న బంధువులకన్న ఇవ్వాళ వచ్చిన మామగారెక్కువయినాడా? ఆయనవచ్చి అందర్నీ పిలిపించటం ఎంత అవమానం? వారు వచ్చేరా? రాలేదా? అని విచారించకుండా మూడు ముళ్ళూ వేయించి – రజస్వల అయిన పిల్లకు! హరి! హరి!..." వారి మాటలు మధుసూదనం లెక్కచెయ్యలేదు. కాని అతని తల్లి విషయమే అతనికి చాలా బాధాకరంగా ఉంటూ వచ్చింది. ఆమెకెందుకంతకోపం?

మధుసూదనం తిరిగివచ్చి జరిగినదంతా సోమసుందరానికి చెప్పేడు. ఆయన తల ఆడిస్తూ "నేను మొదటనే ఊహించేను. దీనికి సిద్ధంగా ఉండాలి నువ్వు!"

లీలావతికి మాత్రం మధుసూదనం నిజం చెప్పలేదు.

"అత్తగారు రాలేదేం? నాకు అత్తగారి దగ్గిర ఉండాలని చాలా రోజులనించి మనసుగా ఉంది! అత్తగారు తల్లి తరవాత తల్లి కాదూ? నేను మా అమ్మను ఎరుగను!" అన్నది లీల.

"మా అమ్మకు ఉన్నచోటు కదలటమంటే ఇష్టంలేదు!" అన్నాడు మధుసూదనం.

"ఎవరైనా ఈ పెళ్ళికి కోప్పడ్డారా? నిజం చెప్పండి!"

"కోప్పడ్డమెందుకు? మావాళ్ళకిష్టమే."

"అయితే ఎవరూ వచ్చేరు కారేం?"

"దూరమని."

"నాకు మన ఊరు పోదామని ఉన్నది."

"పోదాంలే."

"ఎప్పుడు?"

"ఇప్పుడేనా?"

"చిత్రం! నేనన్నానా ఇప్పుడేనని? ఎప్పుడన్నాను."

"ఎప్పుడో పోదాంలే."

"వేసవిలో పోదామా?"

"సిమ్లా అనుకున్నావా ఏమిటి?"

"అయితే చలికాలంలో."

"అబ్బ! మాట్లాడకు. లీలా! చిరాకుగా ఉన్నది."

డిశంబరు శెలవులిచ్చేరు. మధుసూదనరావుకు స్వగ్రామం పోవటం ఇష్టంలేదు. లీలావతి పోదామని బతిమాలటం మొదలుపెట్టింది. హనుమాయమ్మగారి ఒంట్లో సరిగాలేనట్టు కూడా తెలిసింది. వెంటనే మధుసూదనరావు భార్యతో ప్రయాణమైనాడు స్వగ్రామంకు. దారిలో అతను భార్యతో "ఒకటి రెండు రోజులుండి తిరిగి మెద్రాసు పోదామంటే మాత్రం వీలుపడదు. శలవులల్లా అక్కడే ఉండాలి!" అన్నాడు.

"నేనన్ను చూడండి" అన్నది లీలావతి.

కొడుకునూ కోడల్ని చూచినప్పుడు హనుమాయమ్మకు సంతోషమేమైనా కలిగితే అది పైకి కనిపించలేదు. ఎవరో బంధువులు వచ్చినట్టు ఆమె వారికి కాళ్ళు కడుక్కోటానికి నీళ్ళిచ్చి, కూర్చోబెట్టి మర్యాద చేసింది.

హనుమాయమ్మ ఒంట్లో నయంగానే ఉంటూన్నది. ఈసారి మధుసూదనరావును ముఖాన ఎవరూ ఏమీ అనకపోయినా అతని ఆందోళన తగ్గలేదు. ఇంకొకరికి తనమీద కోపం ఉన్నదని అతనికి భయంలేదు కాని, తన వల్ల ఎంత మంది మనశ్శాంతి భంగమవుతూన్నదోనని భయం మాత్రం అతనికున్నది. తన తల్లే తనతో సరిగా మాట్లాడదు. వారం రోజులు గడిచేయి.

ఒకరాత్రి భోజనాలవేళ హనుమాయమ్మ పీటలువేస్తూ దూరంగా నిలబడి ఉన్న కోడల్ని చూచి "కాస్త మంచినీళ్ళయినా పెట్టరాదా? వంటలూ వడ్డనలూ చెయ్యకపోతేమానె!" అన్నది పరుషంగా. లీల ఒక్కసారి భర్తవైపు చూచి, నీళ్ళుపెడుతూ, చిన్న బుచ్చుకున్న గొంతుతో "నేనింకా వంటా అదీ నేర్చుకోలేదు. కాని నా చేతయినపని చెయ్యనా? అడగడానికి మీకు స్వతంత్రం లేదా!" అన్నది.

"చదువుకున్నవాళ్ళకు నేనెక్కడ సమాధానం చెప్పగలను?" అన్నది హనుమాయమ్మ ఎగతాళిగా.

ఆరాత్రి లీలావతి భర్తఎదుట తలఎత్తలేదు. మధుసూదనరావు భార్యను దగ్గిరికి తీసుకుని ఆమె తలమీద ముఖం పెట్టి మృదువుగా "లీలా! కోపం వచ్చిందా మా అమ్మ అన్న మాటకు?" అన్నాడు. ఆమె సమాధానం చెప్పలేదు.

"నేనేం చెయ్యను? లీలా! నా మనస్సెంత కష్టపడుతున్నదో ఎరుగుదువా? ఆమె అనే మాటలు పాటించకు."

లీల తలఎత్తి తడికళ్ళతో అతనివంక చూచి "నాకామెను చూస్తే కోపం లేదు. ఆమెను చూస్తే నాకు ఎంతో అభిమానం. అలాంటప్పుడు ఆమెను లెక్కచెయ్యకపోవటం తృణీకరించటంకాదా? నేనలాచెయ్యలేను. ఆమె నన్నర్థం చేసుకోలేదే అది నాకు చాలా కష్టంగా ఉన్నది. ఆ మాటలింకొకరంటే నేను నిజంగా లెక్కచెయ్యను."

"నిన్నర్థం చేసుకుంటే ఆమెనిన్ను నెత్తిన పెట్టుకోదా నా మాదిరిగా? అర్థం చేసుకోవాలని ప్రయత్నం చెయ్యదు. అదీ చిక్కు."

"అసలు తప్పుమీది."

మధుసూదనం నవ్వి "ఏమిటది?" అన్నాడు.

"కోప్పడనంటే చెబుతాను."

"నిన్ను కోప్పడతానా?"

"అయితే, చూడండి. ఆమె ఎదుట మీరు నామీద అభిమానం చూపుతే ఆమెకూ నామీద అభిమానం ఏర్పడుతుంది. ఆమె ఎదుట మీరు నాకు దూరమైపోతారు. ఒక్కసారి నావంక బాగా చూడనైనా చూడరు. అవునా?"

"అదా నువ్వు కనిపెట్టింది. నువ్వన్నమాటలవల్ల ఒక ఆలోచన తట్టింది. ఇంతకన్న మంచి ఉపాయం చెబుతానువిను."

"చెప్పండి చూతాం."

ఎవరో వినేటట్టు మధుసూదనరావు ఆమె చెవిలో రహస్యంగా చెప్పేడు. ఆమె సరిగా వినిపించుకోకుండానే "వద్దు! వద్దు!" అన్నది నవ్వుతూ.

"కాదు! అదే ఉపాయం."

"కాదు!"

"అవును!"

"కాదు!"

"లీలా!"

"అబ్బ! నామాట వినండి అది నాకు బాగుండదు."

"రెండు రోజులు చూడు."

"పోనివ్వండి మీ ఇష్టం."

"నీకిష్టంకాదూ?"

"ఎంత పట్టుదల? నాకిష్టం కాకుండా ఉంటుందా మీకిష్టమయితే? అదిసరే కాని నామీద అత్తగారు చాలా మాటలు చెప్పేరు అందరితోనూ."

"ఎప్పుడు?"

"సాయంత్రం."

'ఏమని?"

"అత్తగారన్నారు కదా – మీ చుట్టాలెవరో చాలామందివచ్చేరులెండి సాయంత్రం మీరు లేనప్పుడు – వారితో అత్తగారన్నారు 'వారం రోజుల నించీ వంట నేనే చేస్తున్నాననుకోండి! వంట చేస్తాననకూడదా అది?' – నేను! – 'అదేనా? ఒక్క పనిలోకి రాదర్రా! చెప్పుకుంటేనమ్మరు!' అన్నారు. అందరు 'నమ్మకేం? మాకు మాత్రం తెలియదా ఏమిటి?' అన్నారు. కాదుకాని అత్తగారేం మాట్లాడుతున్నా నాకు తమాషాగా ఉంటుంది. నన్ను ముఖాన అనకపోతే నాకేం కష్టంగా ఉండదు. మీతోడు! నాకామెను చూస్తే కోపమన్నమాటరాదు. తొందరపడి అన్నారే అని కష్టంగా ఉంటుంది కాని."

"నా ఉపాయంతో అన్నీ వదులుతాయి, చూడు."

3

మర్నాడు ఉదయం అయింది.

హనుమాయమ్మగారు కోడలు పనిలోకి రావటం చూచి లోపల ఆశ్చర్యపడి, పైకి సగం దెప్పుగా సగం నిజంగా, "అప్పుడే ఏం తొందరలే! మెల్లిగా నేర్చుకుందువుగాని పనులు. ముందరనే పెద్ద పనులు చేస్తే నువ్వు చేసినట్టూ కాదు, మళ్ళీ నాకు చెయ్యటం తప్పదు" అన్నది.

లీల తలవంచుకుని సమాధానం చెప్పలేదు. హనుమాయమ్మ తృప్తి పడ్డది. త్వరలోనే ఆమె తృప్తి పడటానికింకొక కారణం లభించింది.

హనుమాయమ్మ కోడలిమీద అదుపుచేసి తృప్తి పొందుదామనే స్వభావం కలదికాదు. ఆమె అభిప్రాయం స్త్రీ భర్తకూ, అత్తగారికీ భయం భక్తీ చూపించి సేవచెయ్యాలని. ఆమె ఆ విధంగానే ప్రవర్తించింది. మొదటినుంచీ ఆమె అనుమానం లీలావతి ఇంకొక లోకంతో సంబంధించిన మనిషనీ; ఆమె సరియయిన కోడలూ, భార్యా కాదనీ; అత్తగారికీ భర్తకూ మించిపోతుందని.

ఈ వారం రోజుల్లో లీలావతి ప్రవర్తన ఆమె అనుమానాన్ని రద్దుచేసే మాదిరిగాలేదు. కాని ఈ విషయం సగం అనుమానం తీరింది. ఈ రోజున – తనకు సంబంధించి నంతవరకు తీరినట్టే. మధుసూదనరావే స్థితిలో ఉన్నాడు? ఆమె చేతిలో కీలుబొమ్మ అయిపోయినాడా? కొద్దిసేపట్లో ఆ అనుమానం కూడా తీరింది.

ఆ రోజుల్లా మధుసూదనరావు భార్య విషయం చాలా చిరాకుతో ఉన్నాడు. ఉన్నట్టుండి అయినదానికీ కానిదానికీ విసుక్కుంటూ. లీలావతి నోరు తెరవలేదు.

హనుమాయమ్మకు పెద్ద బరువు వదిలినట్టుంది. అన్నమంతా పట్టి చూడనక్కరలేదు. లీలావతి చాలాసాధువు.

హనుమాయమ్మకే చిత్రంగా, ఆమెకు కోడలిమీద ఆ కాస్త అనుమానం పోగానే కోడల్ని చూస్తే చాలా అభిమానం కలిగింది. ఆమె తన కోడలుకద! అప్పుడే ఎంతమందో తనకు "నీకోడలెంత చక్కనిదమ్మా! పూర్వపుణ్యం! రవ్వలాంటి పిల్ల! బుద్ధికూడా మంచిదైతేనా– " అంటూంటే తాను వారికడ్డం వచ్చి "బుద్ధికేంగాని పని విషయంలో" - ఏవేమిటో అన్నది. అదంతా ఇప్పుడెందుకు? తనదే పొరపాటు! "మంచి బుద్ధిమంతురాలయితే పనిపాటలకేం! దానికి పనిచెయ్యవలసిన అగత్యం ఏమిటి? పిల్లకాస్త గారాబంగా పెరిగిందేమో, పనీపాటా చేతకాదు!"

ఆరోజు ఇరుగుపొరుగులతో తన కోడలి విషయం ముచ్చటించేటప్పుడు హనుమాయమ్మగారి ధోరణి పై విధంగా ఉన్నది.

రెండు మూడు రోజుల్లో హనుమాయమ్మ పూర్తిగా మారిపోయింది. పూర్వకాలపు వారు భార్యాభర్తలకు ప్రేమనేది ఎక్కువగా చూడరు. వారికి భార్య పడుతూండడం భర్త అంటూండడం సహజంగా ఉంటుంది. అందువల్ల కుమారుడు కోడల్ని కసరటం ఎక్కువయినా హనుమాయమ్మ ఎక్కువ పట్టించుకోలేదు. ఆమెకు కొడుకు నటిస్తున్నాడని అనుమానం కూడా పోలేదు. తల్లి చూస్తుండగా అతను భార్యవైపు చూచి కూడా ఎరగడు. ప్రేమపూర్వకంగా మాట్లాడి ఎరుగడు.

నానాటికీ మధుసూదనరావు ఆగ్రహం ఎక్కువ కావటం మొదలుపెట్టింది. హనుమాయమ్మ కొడుకును చూచి ఆశ్చర్యపడటం మొదలుపెట్టింది. ఎన్నడూ అతనంత కోపం ఎరుగడు. ఏమిటీ ఉపద్రవం? నిష్కారణంగా కూడా! చివరకామెకు కొడుకును చూస్తే ఒకవిధమైన భయం ప్రారంభమయింది. కోడలు ముఖం చూడగానే ఆమెకు ప్రేమ పొంగిపోయేది. కొడుకు కోడలూ ఒకచోట ఉంటే, ఎప్పుడు కస్సుమంటాడో అని ఆమెనేదైనా పనిమీద పంపేసేది. మధుసూదనరావు భార్యను ఆ సందర్భంగా తప్పు పట్టేవాడు. తప్పుకాదని లీలవైపున తల్లి వాదనకొస్తే పశ్చాత్తాపపడక "అయితే మాత్రం?" అనేవాడు.

కొడుకూ కోడలూ వచ్చి ఇరవై రోజులయింది. హనుమాయమ్మకు కోడలంటే ప్రాణమయిపోయింది. ఇప్పుడామె కోడలి విషయం అందరితో చెప్పటం "ఏమోననుకున్నాను. దానికి పాపం నోట్లో నాలిక లేదమ్మా" అని.

ఒకరాత్రి మధుసూదనరావు భోజనం చేసి ఎక్కడికో వెళ్ళేడు. ముఖం మటమట లాడుతూ ఆ రోజుల్లా అతను భార్యమీద మండిపడుతూనే ఉన్నాడు.

హనుమాయమ్మ మనస్సులో ఏదో దిగులు బయలుదేరింది. పది గంటలయింది. లీలావతి వెళ్ళి పడుకున్నది. అరగంట గడిచింది. చరచరా మధుసూదనరావు ప్రవేశించేడు.

"అమ్మా!"

"ఎక్కడికి పోయినావురా? నాయనా!"

"ఎక్కడికీలేదు కాని నాకు బయట మంచం వేస్తావా?"

"అదేమిట్రా?"

"నేను లోపల పడుకోలేకుండా ఉన్నాను – దోమలు!"

"చా! అన్నీ వట్టిదే! వెళ్ళి పడుకో!"

"నీకు తెలియదమ్మా!"

"ఒక్కసారి ఇట్లా కూర్చో!" మధుసూదనరావు తల్లి మంచం మీద కూర్చున్నాడు.

హనుమాయమ్మ పదేళ్ళకు మళ్ళీ కొడుకు తల చేత్తో నిమురుతూ, "పాపం, దాన్నెందుకురా మరీ అంత వ్యథ పెట్టటం, నిజంగా అది చేస్తున్న తప్పొకటి చెప్పు! అది ఎంత అమాయకురాలు! చిన్నప్పుడెంత నెమ్మదిగా ఉండేవాడివి! ఆ నెమ్మది ఏమైపోయిందిరా? నాయనా! నామాట వినవూ?"

"వింటాను!" అన్నాడు మధుసూదనం. అతని కళ్ళు నీళ్ళతో నిండినాయి. అటువంటి తల్లి! ఆమెను మోసగించవలసి రావటం! లేకపోతే ఈ విరుద్ధ సంప్రదాయాలు ఏ విధంగా కలవను?

"వెళ్ళి లోపల పడుకో!"

మాట్లాడకుండా మధుసూదనరావు లోపలికి వెళ్ళేడు. లీలావతి మంచం మీద బోర్లా పడుకున్నది.

మధుసూదనం ఆమెను వెల్లకిలా తిప్పి "లీలా! ఏమిటిది? ఏడుపే? నాకు నిజంగా కోపం వచ్చిందనే? నువ్వు నిజంగా అంత అమాయకురాలివా?"

లీల కళ్ళు తుడుచుకుంటూ "అదికాదు. పాపం ఆమెతో ఎలా అబద్ధాలాడేరు? అంత మంచి మనిషి లేదు. మీరు ఒంటరిగా ఉంటే నన్నింకా కోప్పడతారని ఈసారి ఆమె కూడ మనతో వస్తానన్నారు."

"భేష్! నేను చెప్పలేదూ. నా ఉపాయం పారుతుందని?"

"ఇక మీ ఉపాయం మాని నేను చెప్పినది కూడా చేసి చూడండి!"

"సరే అయితే!" అంటూ మధుసూదనరావు భార్యను చేతుల్లోకి తీసుకుని ముద్దుపెట్టుకున్నాడు.

మొదటి ముద్రణ : గృహలక్ష్మి, సెప్టెంబర్ 1931